'అధికారులపై చర్యలు తీసుకోవాలి'

మేడ్చల్: కోర్టు, లోకాయుక్తకు తప్పుడు నివేదికలు ఇచ్చిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని గౌడవెల్లి గ్రామానికి చెందిన నాయకుడు నరేందర్‌రెడ్డి రాష్ట్ర సీఎస్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. మేడ్చల్ మండలం గౌడవల్లి గ్రామంలో ప్రభుత్వ భూమి ఎవాక్యు ప్రాపర్టీ సర్వే నంబర్లు 331/1-2, 352, 364/1-2, 365/1-2 లో గల 29.24 ఎకరాల భూమిపై క్రయ విక్రయాలు నిషేధిస్తూ 22అ రిజిస్టర్‌లో చేర్చగా 12 ఏళ్లుగా మేడ్చల్ తహసీల్దార్, ఆర్డీఓ పనిచేసిన అధికారులు ఈ భూమిపై ఉన్నతాధికారులకు, కోర్టులు, లోకాయుక్తకు తప్పుడు నివేదికలు ఇచ్చి కబ్జాదారులకు సహకరించి సుమారు రూ. 300 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అయ్యేందుకు కారణమయ్యారని ఆరోపించారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

ఘట్‌కేసర్‌కు అఖండ జ్యోతి రథం



ఘట్‌కేసర్: యాదాద్రి లక్ష్మీనర్సింహాస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బర్కత్‌పుర యాదగిరి భవన్ నుంచి యాదాద్రికి బయలుదేరిన శ్రీ లక్ష్మీనరసింహాస్వామి అఖండ జ్యోతి రథం గురువారం ఘట్‌కేసర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ఘన స్వాగతం పలికారు. అఖండ జ్యోతి రథం శనివారం ఉదయం వరకు యాదాద్రికి చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

కుత్బుల్లాపూర్: ఆయా డివిజన్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కొంపల్లి పురపాలక సంఘం ప్రత్యేకాధికారి చంద్రమోహన్ అన్నారు. వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. వార్డుల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, ట్రేడ్ లైసెన్స్‌ల జారీ, ఎల్ఆర్ఎస్ సర్వే, అడ్వర్‌టైజ్‌మెంట్, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్ తదితర వాటి గురించి తెలుసుకున్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, డిప్యూటీ ఇంజినీర్ నరేష్, అసిస్టెంట్ ఇంజినీర్ ప్రవీణ్, మేనేజర్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

చింతల్: మానవసేవే మాధవసేవ అని ఉషారాణి నేచురోపతి క్లినిక్ ఆక్యుపంచరి డాక్టర్ రాధిక లేళ్ల అన్నారు. ఉషారాణి మెమోరియల్ ట్రస్ట్, ఉషారాణి నేచురోపతి క్లినిక్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చింతల్ హెచ్ఎంటీ కాలనీలోని పోచమ్మ ఆలయ ఆవరణలో ఉచిత వైద్యం నిర్వహించారు. బీపీ, డయాబెటిస్ టెస్టులతో పాటు ఇతర పరీక్షలను నిర్వహించారు. అవసరమైన పేషెంట్లకు ఆక్యుపంచర్ చికిత్సలు అందజేసి, మందులను పంపిణీ చేశారు.

స్టార్టప్ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

రాయదుర్గం: భారతదేశంలో స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో టీహబ్-ఎస్ఎస్ఆర్‌సీఈఎల్, ఐఐఎం బెంగళూరుతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ ఒప్పందంలో భాగంగా ఎస్ఎస్ఆర్‌సీఈఎల్ సీఈఓ ఆనంద శ్రీ గణేష్, ప్రోగ్రామ్ మేనేజర్లు విశాల్, కార్తీక్‌కుమార్ చౌదరి, టీహబ్ ఇన్‌చార్జీ సీఈఓ సుజిత్ జాగిర్దార్, అధికారులు పాల్గొన్నారు. బెంగళూరు, హైదరాబాద్‌లోని పర్యావరణ వ్యవస్థలలో మహిళల నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపకులుగా ఎదిగేందుకు గొప్ప అవకాశాలను అందించడానికి రెండు సంస్థలు సమిష్టిగా కృషి చేస్తాయి. టీహబ్, ఎస్ఎస్ఆర్‌సీఈఎల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువుల సంరక్షణ అందరి బాధ్యత

చందానగర్ : చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కొత్తకుంట చెరువు సుందరీకరణ, పునరుద్ధరణ పనులు పూర్తైన నేపథ్యంలో కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, ఐటీ కంపెనీ ప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ, జెన్ పాక్, యూనైటెడ్ వే హైదరాబాద్ ఐటీ కంపెనీతో పాటు సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా సుందరీకరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరీకరిస్తామన్నారు. పర్యావరణం పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఐటీ సంస్థ ప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గర్భాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు



యాగశాలలో కలశపూజ చేస్తున్న వేదపండితులు, వేదపాఠశాల విద్యార్థులు



స్వామివారి నందివాహనసేవలో భక్తులు..



ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద భక్తులు



రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం ..

వైభవంగా బ్రహ్మోత్సవాలు

- కీసరగుట్టలో నాలుగో రోజుకు వేడుకలు
- భక్తుల ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజ
- రాత్రి వైభవంగా విమానరథోత్సవం



కీసర: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు వేదపండితులు గురువారం ఉదయం స్వామి సన్నిధిలో గర్భాలయంలోని స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం పూజ చేశారు. మరోవైపు ఆలయం పక్కన గల యాగశాల్లో టీటీడీ వేద పాఠశాల పండితులు గణపతిశర్మ, వేద విద్యార్థులతో కలిసి రుద్ర స్వాహాకార హోమాన్ని నిర్వహించారు. అలాగే సాముహిక అభిషేకాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు ప్రదోషకాల పూజ, హారతి, మంత్ర పుష్పం తదితర పూజలు నిర్వహించారు. రాత్రి 8 తర్వాత కొండ దిగువన గల పార్క్ సమీపంలో స్వామివారికి విమాన రథోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణ రథానికి పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. తెల్లతామర కొలను వరకు కొనసాగిన రథోత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

- స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో కీసరగుట్టకు తరలివచ్చారు. స్వామిదర్శనానంతరం ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో గల శివలింగాలకు అభిషేకాలు నిర్వహించారు. కాగా మహాశివరాత్రి అర్ధరాత్రి లింగోద్భవకాలంలో గర్భగుడిలో స్వామివారికి వేద పండితులు వైభవంగా సంతతధారాభిషేకం చేశారు. ఆలయం ఎదురుగా శివలింగాలు ఉండడంతో భక్తులు కూడా పూజలు నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో నేటి పూజలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు (శుక్రవారం) ఆలయంలో పలు పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 5.30 నిమిషాలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాముహిక అభిషేకాలు, (కల్యాణ మండపంలో) ఉదయం 7 గంటలకు అన్నాభిషేకం, రాత్రి 7 కు ప్రదోషకాలపూజ, హారతి, మంత్రపుష్పం, రాత్రి 8 గంటలకు వసంతోత్సవం, పుష్పయాగం, పూజలు నిర్వహించనున్నారు.



కీసరగుట్టలో దర్శనానికి బారులు తీరిన భక్తులు



శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



జాతరలో వస్తువులు కొనుగోలు చేస్తున్న భక్తులు



కీసరగుట్టలో భక్తుల రద్దీ



కీసరగుట్టలో స్వామివారి విమాన రథోత్సవంలో భక్తులు

బూస్టర్‌పంపు ఏర్పాటుతో నీటి ఎద్దడికి పరిష్కారం

చింతల్: జీడిమెట్ల సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న నీటి ఎద్దడి పరిష్కారానికి అధికారులు ముందడుగు వేశారు. వైష్ణవి ఎన్‌క్లేవ్, పేట్‌బషీరాబాద్, రంగారెడ్డి బండ, యాదిరెడ్డి బండ, ఫూడ్స్ కాలనీ తదితర ప్రాంతాలకు సరఫరా అయ్యే ప్రధాన పైపులైన్‌కు బూస్టర్ పంపు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. చింతల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజేష్, సెక్షన్ మేనేజర్లు శివప్రసాద్ రోహిణి, ఎలక్ట్రికల్ మేనేజర్ అమర్‌నాథ్‌లో కలిసి నేషనల్ హైవే రోడ్డు పక్కనే ఉన్న సెయింట్ ఆన్ హైస్కూల్ వెనకాల ఉన్న ఛాంబర్ వద్ద బూస్టర్ పంపు ఏర్పాటు చేసేందుకు గురువారం పరిశీలించారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే బూస్టర్ పంపు బిగింపు ప్రక్రియ త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. చుట్టుపక్కల బస్తీలు, కాలనీలకు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని డీజీఎం తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి



కేపీహెచ్‌బీకాలనీ: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కేపీహెచ్‌బీ డివిజన్, 9వ ఫేజ్‌లోని గ్రౌండ్‌లో గురువారం తెలంగాణ జాగృతి స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడా పోటీల ద్వారా పోటీతత్వం పెరిగి లక్ష్యం వైపు పరుగెడతారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు మందడి శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజేష్, గోపి, నారాయణరాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు పార్కులను పరిశీలించనున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం కేపీహెచ్‌బీ డివిజన్‌లో పర్యటించనున్నట్లు కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.30 గంటలకు మలేషియన్ టౌన్‌షిప్ వెనుక వైపు 5 ఎకరాల్లోని పార్కు పరిశీలన, రోజరీ స్కూల్ ముందు ట్రయాంగిల్ పార్కు, 4వ ఫేజ్ బస్టాప్ థీమ్ పార్కు, బస్తీ దవాఖానా ముందు గల పార్కును పరిశీలించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



జవహర్‌నగర్ అంబేడ్కర్‌నగర్ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రథయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



నృత్యం చేస్తున్న కళాకారులు

జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలోని పలు శివాలయాల్లో గురువారం శివపార్వతుల కళ్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నదానాలు చేపట్టారు.

వైభవంగా శివపార్వతుల రథయాత్ర

పోచారం: పోచారంలోని స్పటిక లింగేశ్వర స్వామి ఆలయం నుంచి గురువారం రాత్రి శివపార్వతుల రథయాత్రను చేపట్టారు. కళాకారుల నృత్య ప్రదర్శనలు, డప్పు చప్పుళ్ల మధ్య రథయాత్ర పుర వీధుల గుండా సాగింది. కాంగ్రెస్ నాయకుడు వజ్రేశ్ యాదవ్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివపార్వతులకు ఆహ్వానం పలుకుతూ ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా ప్రపంచ ఎన్‌జీవో దినోత్సవం

సుభాష్‌నగర్: సూరారం కాలనీలోని లూయిస్ బ్రెయిలీ భవనంలో గురువారం ప్రపంచ ఎన్‌జీవో డే ను ఘనంగా నిర్వహించారు. వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్ సంస్థ అధ్యక్షుడు అంజయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. పర్యావరణవేత్త కోలా రవీందర్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకంతో పెను ముప్పు పొంచి ఉందని, ప్రత్యామ్నాయ వస్తువుల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మీడియేటర్ మాణిక్యరెడ్డి మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు సేవలందిస్తున్న పలువురు ఎన్‌జీవోలను సత్కరించారు. కార్యక్రమంలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ బ్లైండ్ తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్‌గౌడ్, విప్లవ జ్యోతి అల్లూరి ఫౌండేషన్ అధ్యక్షుడు తాతాజీ, మనం ఫౌండేషన్ ప్రతినిధి శ్యామ్, రిటైర్డ్ గెజిటెడ్ హెచ్ఎం ముతోజు వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్ సంస్థ ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌జీవోలను సన్మానిస్తున్న ప్రతినిధులు

రాష్ట్ర వర్సిటీల్లో ప్రవేశ నిబంధనలు మార్చండి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణలోని వివిధ వర్సిటీలలో ప్రవేశ నిబంధనలలో మార్పు చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) రాష్ట్ర అధ్యక్షులు నక్క శ్రీశైలం యాదవ్ గురువారం డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా కొనసాగుతూ వర్సిటీల ప్రవేశాలకు 15 శాతం (ఓపెన్ టు ఆల్) సీట్లలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కూడ అడ్మిషన్లు పొందారని పేర్కొన్నారు. గత ఏడాది జూన్ నాటికి పదేళ్లు ముగిసినా ఇంత వరకు ప్రభుత్వం కొత్త నిబంధనలు రూపొందించనందున పాత పద్ధతిలోనే ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. ఏపీలో కొత్త నిబంధనలతో ప్రవేశాలు జరుగుతుండగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పాత పద్ధతిని కొనసాగించడం వలన విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

దుండిగల్: పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధి సహకరించాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరనాయక్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డులో ఆస్తి పన్ను వసూలు పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే నోటీసులు జారీ చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. అన్ అసెస్మెంట్, అండర్ అసెస్మెంట్ ప్రాపర్టీలను వెంటనే గుర్తించి ఆస్తి పన్ను విధించాలని, అదే విధంగా ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేయడంతో పాటు కొత్త వారికి లైసెన్స్‌లు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ ఆఫీసర్ ప్రభాకర్, బిల్ కలెక్టర్‌లు పాల్గొన్నారు.



ఆస్తి పన్ను వసూలు వివరాలు పరిశీలిస్తున్న కమిషనర్

మురుగు పరుగు..!



గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో అండర్ డ్రైనేజీ నిండి మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు నీరు బయటకు వచ్చి రోడ్డుపై పారుతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత సిబ్బంది మ్యాన్‌హోల్స్, డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. – మేడ్చల్‌రూరల్

సంస్కృతం, ఆంగ్లభాషను నేర్చుకోవాలి



హెచ్‌సీయూలో జరిగిన అంతర్జాతీయ సమావేశంలో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: పరిశోధనలో నూతన అంశాలను వివరించడానికి తెలుగుతో పాటు సంస్కృత, ఆంగ్లభాషలను నేర్చుకోవాలని తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య అనుమాండ్ల భూమయ్య పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్, తెలుగు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు అధ్యక్షతన 'తెలుగు భాషా సాహిత్యాల పరిశోధన-పర్యావలోచన' అనే అంశంపై గురువారం రెండురోజుల అంతర్జాతీయ సదస్సును ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏదైనా పరిశోధన అనేది విస్తృత అంశాల పరిజ్ఞానంతో మరింత పరిపుష్టం అవుతుందన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో తగినంత మంది అధ్యాపకులు లేకపోవడంతో పరిశోధనలు తగ్గుముఖం పడుతున్నాయన్నారు. సీనియర్ పాత్రికేయులు డాక్టర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ తమతమ సామాజిక, ప్రాంతీయ అస్తిత్వాలను అన్వేషించే దిశగా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందన్నారు .ప్రతి అంశంపై పూర్తి అవగాహన అవసరమని ఆయన సూచించారు. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం ఆచార్యులు అఫ్సర్ మాట్లాడుతూ అమెరికా, మరికొన్ని దేశాల్లో తెలుగు భాషా సాహిత్యాలను నేర్చుకోవడం, అధ్యయనం చేయడం ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు దార్ల వెంకటేశ్వరరావు, గోనానాయక్, పమ్మి పవన్‌కుమార్, వారిజారాణి, త్రివేణి వంగరి, ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి, బూదాటి వెంకటేశ్వర్లు, సి.ఖాసీం, డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి, డాక్టర్.రజని, విజయ్‌కుమార్, వెల్దండి శ్రీధర్, సంగిశెట్టి శ్రీనివాస్‌లు పత్ర సమర్పణ చేశారు. ఈ సమావేశంలో భూక్యా తిరుపతి, డాక్టర్ భుజంగరెడ్డి, డాక్టర్ బాశెట్టి లత, విద్యార్థులు పాల్గొన్నారు.